# వెలుగుదారి

"అందరూ వొచ్చినారు....అక్కరాలేదే ఎందుకుమా" ప్రశ్నించింది సక్కీబాయి. ఉడుకుతున్న కోడికూరను గరిటతో రెండు చుక్కలు అరచేతిలో వేసుకుని రుచిచూసి "వస్తాదిలే....ఎంతసేపూ అక్క కలవరమేనా?" అంది కాస్త విసుగ్గా కేశ్లీబాయి.

అమ్మను, ఉడుకుతున్న కూరను కాసేపు తదేకంగా చూసింది సక్కీబాయి. అది పన్నెండంకణాల మిద్దె యిల్లు. వంటగది, హాలు, బెడ్‌రూం వున్నాయి. హాలు నిండుకూ మనుషులున్నారు. కొందరు సారాయి తాగేసి వున్నారు. యింకొందరు తాగుతున్నారు. బీడీలు, సిగరెట్ల పొగ. బూతులు, నవ్వులు, అరుపుల్లాంటి మాటలు. అయిదారుమంది బయట మంచాలమీదున్నారు. అందరూ సక్కీబాయికి బంధువులే. అంతమంది వున్నా ఆ అమ్మాయి మనసంతా అక్కమీదే వుంది.

"అమ్మా....అక్కకు కోడికూరంటే చానా యిష్టం కదా....పిల్చుకోనొస్తా" అంది అమ్మ దగ్గరకు చేరి గోముగా.

"మ్మేయ్...నోర్మూసుకోనుంటావా....?అక్కంట అక్క" అరిచింది కేశ్లీబాయి.

సక్కీబాయి ముఖం చిన్నబోయింది. కళ్లనుంచి రెండు చుక్కలు చెంపల మీదకు జారాయి. అమ్మకు కన్పించకుండా అటు తిరిగి తుడుచుకుంది.

సక్కీబాయికి పన్నెండు సంవత్సరాలు. రజస్వల అయి నెలదాటలేదు. ముఖంలో పసితనం పోలేదు. గుండ్రటి ముఖం, ఎర్రటి పెదాలు, తెల్లటి శరీరం, పొడవాటి జుట్టు. ఆకుపచ్చని పావడా మీదకు గులాబిరంగు పైటను వేసుకోనుంది. తలనిండుకు బంధువులు తెచ్చిన మల్లెపూలు.

అక్క ఎందుకు రాలేదు....అనుకుంటూ యింట్లోనించీ బయటకు వచ్చింది సక్కీబాయి.

కొత్తగా వేసిన వీధి దీపాలు చీకటి పడకముందే వెలుగుతున్నాయి. తండ్రి జగ్గానాయక్ వైపు చూసింది. బంధువులతో నవ్వుతూ మాట్లాడుతున్నాడు.

"నా రెండో బిడ్డ...సక్కీబాయి...దేవత....వజ్రం.... పెద్ద బిడ్డ బంగారం.....అయినా లాభంలే....వజ్రంతోనే యింగ మా బతుకులంతా" ముద్దగా వస్తున్నాయి మాటలు.

సక్కీబాయికి తండ్రి మాటలు అర్థం కాలేదు. యింతకుముందు పండగలకు, జాతర్లకు

తప్ప తాగని నాయన రెండు సంవత్సరాలనుంచీ వళ్లు మరిచిపోయేలా ఎందుకు తాగుతున్నాడో అర్థం కావడంలేదు. చిన్నాయనలు, మేనమామలు, మేనత్తలు... అందరూ వుండారు. అక్క మాత్రమే లేదు. ముందుగా అక్కను చూడాలనుంది సక్కీబాయికి. అటూ యిటూ చూసింది. తననెవరూ గమనించడం లేదనుకోగానే వీధిలోకి జారుకుంది. వడివడిగా నడవసాగింది.

కర్మసాక్షి కొండలచాటుకు పోతున్నాడు.

నెలవంక తూర్పు కొండలమీదనుంచి నిక్కి చూస్తున్నాడు.

అది పెద్ద బిడ్కి. చిత్తూరు జిల్లాలోని మారుమూల ప్రాంతం. నలభైకి మించి ఇళ్లులేవు. వాటిలో పది పూరిగుడిశెలు. ఐదారు రేకుల ఇళ్లు. మిగిలినవన్నీ మిద్దెలు. గుడిశెల గోడలన్నీ మట్టితో కట్టినవే. అవీ వర్షానికి సగం కరిగిపోయాయి. గుడిశెలముందు మట్టి పొయ్యిల దగ్గర వంట ప్రయత్నంలో ఆడవాళ్లు పొగతో యిబ్బంది పడుతున్నారు. తల్లి స్థనాలను వదలలేక పొగలో వుండలేక వుక్కిరి బిక్కిరవుతున్నారు దిగంబరంగా వున్న చిన్న పిల్లలు. వాళ్లకన్నా పెద్ద పిల్లలు తల్లుల పక్కన చేరి "అన్నంమో..." అంటూ ఏడుపులు. దాదాపు మిద్దె ఇళ్లన్నింటిలో టివిల మోత. వీధిలో ఆడుకునే పిల్లలు తక్కువ. దూరంగా మేతకు వెళ్లి తిరిగి వస్తున్న పశువుల మెడల్లోని గంటల శబ్దం విన్పిస్తోంది.

సక్కీబాయి వీటిని పట్టించుకోలేదు. వేగంగా నడవసాగింది. పది నిమిషాల్లో తన అక్క సోమ్లీబాయి వుంటున్న చోటుకు సమీపంలోకి వచ్చింది. వెన్నెల వెలుగులో రెండు గుడిశెలు సినిమా సెట్టింగ్‌లా కన్పిస్తున్నాయి. వాటికాపక్క పింఛా ఏటి నీటిలో చంద్రకిరణాలు తెల్లగా పరచుకోనున్నాయి. ఏటినుంచి చల్లటిగాలి వీస్తోంది.

అక్క గుడిశెను సమీపించింది సక్కీబాయి. గుడిశెలో నూనెదీపం గుడ్డిగా వెలుగుతోంది. వెదురుబద్దలతో చేసిన తలుపు, దాలమండ్రానికి దారంతో ముడివేసి వుంది. బయట మంచం ఖాళీగా వుంది. పక్కగుడిశె ముందు చాపమీద పడుకోనున్నామె దగ్గరకు వెళ్లి "అక్కా..మా అక్క యాడికి పోయింది." అనడిగింది సక్కీబాయి.

"ఎవరూ...." అంటూ లేచి కూర్చుందావిడ.

"నేను సక్కీబాయిని....మా అక్క...."అంటూ ఆపేసింది.

"నువ్వామ్మె....మీ అక్క ఏటికాడ కూచ్చోనుంటాది. ఏమి పొద్దు పొయ్యినాంక వచ్చినావే" ఆమెకు సమాధానం యివ్వకుండా వేగంగా నడచుకుంటూ ఏటి వద్దకు వెళ్లింది. దూరంనించే "అక్కా" అనరిచింది సక్కీబాయి.

అటువైపునుంచి సమాధానం రాకపోవడంతో మళ్లీ మళ్లీ అరచింది. ఐదోసారి పిలుపుకు "సక్కీ నేనీడ వుండాను" అనే హీన స్వరం విన్పించింది.

ఆ స్వరం వింటూనే మరింత వేగంగా నడచుకుంటూ అక్కను సమీపించింది. అంత

వరకూ యిసుకలో పడుకోనున్న సోమ్లీబాయి మెల్లగా లేచి కూర్చుంటూ "ఏంమ్మా... మొబ్బయినాంక వచ్చినావే" అంది.

"అక్కా...యింట్లో నాటుకోళ్లు ఐదారు కోసినారు. కూర వుడకతాండాది" వుత్సాహంగా చెప్పింది సక్కీబాయి. వేగంగా వచ్చినందుకు సక్కీబాయి ఎద ఎగిసెగిసి పడుతోంది. చెల్లెలి మాటలతో అక్క వులిక్కిపడింది.

"ఐదు కోళ్లా" గొనుగుతున్నట్టుగా అంది.

"అవునక్కా...మామోళ్లు, అత్తోళ్లు, చిన్నాయనోళ్లు...అందరూ వచ్చినారు. నువ్వేలేంది. నిన్ను పిల్చకపోదామని వచ్చినా" సంబరంగా చెప్పింది సక్కీబాయి.

"అందరూ వచ్చినారా..." తనలో తనే గొనుక్కుంది సోమ్లీబాయి.

సోమ్లీబాయికి పదిహేడు సంవత్సరాలు. వంట్లో కండలేదు. ఎముకల గూడులా వుంది. ముఖంలో యౌవన కళలేదు. డెబ్బైఏళ్ల ముసలిదానిలా వుంది. ముడుతలుపడిన ముఖంలో ఎలాంటి భావాలు కదులుతున్నాయో అర్థం కావడంలేదు.

కాసేపటి తర్వాత "వాళ్లంతా ఎందుకు వచ్చినారో తెలుసా" ప్రశ్నించింది చెల్లిని.

"రేపు నాకు బడి వుంది కదాక్కా. సుండుపల్లె హాస్టల్లో చదువుకుంటాండా కదా. రేపు పోతే మళ్లా నాలుగైదు నెలలు రానని చూసి పొయ్యేదానికి వచ్చినారు" బదులిచ్చింది సక్కీబాయి.

"అందుక్కాదు...." అంది సోమ్లీబాయి. దుఃఖంతో ఆమె గొంతు పూడుకుపోయింది. కళ్లనుంచి నీళ్లు జలజల రాలడం వెన్నెల వెలుగులో అస్పష్టంగా కన్పించింది సక్కీబాయికి. అక్క చెంపలమీద జారుతున్న కన్నీళ్లను తుడుద్దామని ముందుకు రాబోయింది. అమ్మానాయన చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. 'మీ అక్కకు భయంకరమయిన జబ్బుండాది. అందుకే దూరంగా గుడిశెలో పెట్టేసినాం. నువ్వుగూడా ఆడికి పోవద్దు. ఆయమ్మితో మాట్లాడద్దు. నీకూ ఆ జబ్బు వచ్చేస్తాది.'

అమ్మానాన్నలు ఎంతగా చెప్పినా అక్కమీదుండే ప్రేమకొద్దీ అప్పుడప్పుడూ వచ్చి పోతూనే వుంటుంది. కాసేపటి తర్వాత కన్నీళ్లు తుడుచుకుని "యింతకు ముందు నీకు ఎన్నిసార్లు లీవులురాలా. వాళ్లొచ్చి పోయినారా?" ప్రశ్నించింది సోమ్లీబాయి.

సక్కీబాయి మౌనంగా వుండిపోయింది. ఆకాశంలో ఏవో పక్షుల గుంపు వెళుతోంది. దూరంనుంచీ నక్కల వూళలు విన్పిస్తున్నాయి. ఏటికాపక్కన పింఛానుంచి పీలేరుకు పోతున్న బస్సు హారన్ వినిపిస్తోంది.

"ఐదేండ్లకు ముందుమాట...అప్పుడూ యిట్లే చేసినారు" అంది సోమ్లీబాయి.

"ఏం చేసినారుక్కా...." అంది నిరుత్సాహంగా సక్కీబాయి.

"యిప్పుడు నువ్వయినా చదువుకొంటాండావు. నాకు చదువులేదు పాడూలేదు. ఆ

రోజు జరిగింది మాత్రం ఎప్పటికీ మర్చిపోలేను. ఎట్ల పోతాను. నా జీవితాన్ని మలుపు తిప్పిన రోజది. ఆ రోజు జరిగిన సంగతులన్నీ చెప్తాను." అంది సోమ్లీబాయి.

అక్క చెప్పబోయే విషయాలను వినడానికి వుత్సాహంగా సిద్ధమయింది సక్కీబాయి. సోమ్లీబాయి ఆలోచనల్లోకి జారుకుంది. ఆలోచనల్లోంచి ఆనాటి సంఘటనలు ఒక్కొక్కటే ప్రవాహంలా బయటకు రాసాగాయి.

"ఎన్నేయిలో....

ఎర్రగడ్డలో...

జిల్లేడు చెట్టుకింద మల్లెమొగ్గలో..." అంది రాగయుక్తంగా సోమ్లీబాయి. మిగిలిన పిల్లలంతా సోమ్లీబాయి గొంతుకు జతకలిపారు.

తూర్పు కొండలచాటునుంచీ చంద్రుడు ఆత్రంగా ఎగబడుతున్నాడు. మేతకు వెళ్లిన పశువులు ఒక్కొక్కటి వచ్చి పల్లె చేరుతున్నాయి. పల్లె మధ్యలోని చింత చెట్టుమీద కాకులు గోల చేస్తున్నాయి. పక్షుల అరుపులు, ఆవుల అంబారావాలమించి పల్లె ఈ చివరనుంచీ సోమ్లీబాయి జత పిల్లలు అరవడంతో పల్లెకు ఆ చివరనున్న రాజూనాయక్ అతని తోడిపిల్లలు కూడా "ఎన్నేయిలో...ఎర్రగడ్డలో...జిల్లేడు చెట్టుకింద మల్లెమొగ్గలో...." అంటూ అరిచారు.

ఒకరికొకరు ఆ అరుపులను పిలుపులుగా భావించుకుని ఉత్సాహంగా అటువైపు వాళ్లు యిటువైపుకు, యిటువైపు వాళ్లు అటువైపుకు వెళ్లారు. సోమ్లీబాయి మిగిలిన పిల్లలు ఉరుకులు పరుగులుగా గోడలచాటున, చెట్లకింద రాజునాయక్ బృందం పోసిన 'ఎన్నెల కుప్పలను' చెరిపేస్తున్నారు. చెరిపేసిన ప్రతిసారీ విజయగర్వంతో నవ్వుతున్నారు.

సోమ్లీబాయికి పన్నెండు సంవత్సరాలు. అందమయిన ముఖం. మాసిన చిరుగుల పావడా, రవికా. ఉత్సాహంతో ఉరకలేస్తూ ఎగబడుతున్న చంద్రుడు కూడా ఆ అమ్మాయి ముఖం కళముందు వెలవెలబోతున్నాడు.

"సోమ్లీ...మ్మే సోమ్లీ" అంటూ తల్లి అరుపు విన్పించడంతో "ఎన్నేరు మొగ్గలు ఆడుకొంటాండాం మా...." వున్న చోటనుంచే బదులిచ్చింది సోమ్లీబాయి.

"మీ నాయన రమ్మంటాండాడు.....రా" అంది కేశ్లీబాయి.

"ఆడుకొంటాండాం మా" అంది సోమ్లీబాయి.

"మీ మామా, అత్తా, చిన్నాయనా, చిన్నమ్మా వచ్చినారు. రా" అంది.

తనకెంతో యిష్టమయిన వాళ్లంతా వచ్చినారని అనడంతో లేడిపిల్లలా చెంగుచెంగున గెంతుతూ యింటికి చేరుకుంది సోమ్లీబాయి.

విరిసీ విరియని గులాబీలా వున్న తనను దగ్గరకు లాక్కుని బుగ్గలమీద ముద్దు పెట్టింది చిన్నమ్మ సరోజినీబాయి. యింటి నిండుకూ బంధువులు. సారాయి మత్తులో మునిగి

పోయున్నారు. ఒకపక్క పొట్టేలు మాంసం వుడుకుతున్న వాసన. అందురు స్త్రీలు నాసిరకం చీరలతో, చేతులకు కాళ్లకు వెండి కడియాలతో, రంగురంగుల రవికెలతో. చేతులనిండా గాజులతో సంప్రదాయబద్ధంగా, మొరటుగా, పేదగా వున్నారు. వారంతా పేదరికం అనుభవిస్తున్నా ముఖంలో మాత్రం నిష్కల్మష నవ్వు. యిద్దరాడవాళ్లు మాత్రం ధగధగలాడే పట్టు చీరలు కట్టుకుని, ఎడం చేతికి బంగారు గాజులు వేసుకుని, కుడిచేతికి గడియారం కట్టుకుని, పెదాలకు రంగు రాసుకుని, మెడనిండా నగలు వేసుకుని మంచంమీద దర్జాగా కూర్చొని వున్నారు.

వీళ్లందరినీ చూడగానే సోమ్లీబాయికి సిగ్గుముంచుకొచ్చింది.

భోజనాలు మొదలయ్యాయి. అందరికీ సారాయి గ్లాసులు ఉండాయి. ఆ యిద్దరాడవాళ్లు మాత్రం తమ చేతి సంచిలోంచి విస్కీ బాటిల్ తీసి తాగసాగారు. చాలామంది కళ్లు ఆబగా వాటిని చూశాయి.

సోమ్లీబాయి చిన్నాయనకు, చిన్నమ్మకు ఈ తతంగమంతా ఎందుకో అర్థం కావడంలేదు.

అమ్మాయిలు పుష్పవతి అయినప్పుడు, పెండ్లిండ్లప్పుడు, చావుదినాలప్పుడు మాత్రమే బంధువులకు చెప్పడం, విందులో మునగడం జరుగుతుంటుంది. ఎలాంటి కారణంలేకుండా విందు ఎందుకు ఏర్పాటు చేశారో అర్థం కావడంలేదు వాళ్లకు. సోమ్లీబాయి ఏడు సంవత్సరాల సక్కీబాయిని సంక దించలేదు. అందరూ తినడం పూర్తయింది. తింటూనే చాలామంది పిల్లలు నిద్రపోయారు. ఆడవాళ్లందరికీ ఈతచాపలు పరిచారు. నిద్రపోయిన సక్కీబాయిని వొడిలో పెట్టుకుని, సోమ్లీబాయి చిన్నమ్మ పక్కన కూచ్చోనుంది. మగవాళ్లంతా నులకమంచాలమీద కుచ్చోని బీడీలు ముట్టించారు. ఆ యిద్దరు ఆడవాళ్లు కూడా మంచం మీద కూర్చున్నారు. ఆ యిద్దరిలో ఒకామె గొంతు సవరించుకుని చెప్పసాగింది.

"మేము చేప్పేది బాగా యినండి. మీ మేలుకోరి చేప్తాండాం. మేమూ మీకు బంధువులమే. పది సంవత్సరాల ముందు మేము ఎట్లున్నేం. తినేదానికి తిండిలేక. కట్టుకోను చీరల్లేక నానా బాధలు పడతాంటిమి. ఈడ అందరి బతుకులూ అట్లే వుండాయి. మేము ఎట్లో నానా తిప్పలు పడి బొంబాయికి పొయ్యినాము. ఆడ పదిసంవత్సరాలున్నేము. తిరుక్కోని వచ్చినాము. యిప్పుడు ఈ సుట్టుపక్కలవుండే బిడ్కీలల్లో మా కన్నా షావుకార్లు లేరు" అని ఆపిందామె మాటలను.

సారాయి తాగడం అలవాటే కాబట్టి అందరూ హుషారుగానే వున్నారు. మత్తులో మునిగి పోయిందీలేదు. విన్నది అర్థం కాకుండానూ పోలేదు.

"థూ...మీది ఒగ సంపాదనేనా....ఆడికి పొయ్యి వూరోళ్లందరి కిందా పడుకోనొచ్చింది

కాక మళ్లా మాకు చెప్తాండారా....” అంటూ కోపంగా లేచి అక్కడినుంచి వెళ్లిపోయారు కొంతమంది మగవాళ్లు.

“వాళ్లనింది నిజమే. మాది అట్లా సంపాదనే. ఎన్నేండ్లని ఈన్నే సస్తా బతకతాం. అడవికి పోయి కట్టెలు కొట్టుకోనిచ్చి అమ్మినా, రైతుల దగ్గరికి కూలికి పొయ్యినా, బేల్దారి పనికి పొయ్యినా – తిండికి గూడా కష్టంగా వుంది. తాత ముత్తాల కాన్నించీ ఈ సుట్టిండ్లలోనే బతకతాండాము. మేము మిద్దిండ్లు కట్టుకున్నాం. అయిదుమందిని తీసకపోయి నాలుగేండ్లయి తాండాది. వాళ్లూ యిండ్లు కడతాండారు. మేము కొంచెం వయసయినాంక పోయినాం. అదే సోమ్లీబాయి అట్లా అమ్మాయయితే, మేము పదేండ్లలో సంపాదించింది ఒకే సంవత్సరంలో సంపాదిస్తారు. అందరిండ్లలో ఆడబిడ్డలుండారు. బాగా ఆలోచించండి.” అంది మరొకామె.

సోమ్లీబాయి పేరు వింటూనే ఆ అమ్మాయి చిన్నమ్మ వులిక్కిపడింది. అప్పటికే సోమ్లీబాయి సక్కీబాయిని పక్కన పడుకోబెట్టుకుని నిద్రపోతోంది. ఆ అమ్మాయి చిన్నాయన కళ్లలో కోపపుచారలు. కోపాన్ని అణచుకుంటున్నాడతను.

కర్మసాక్షి కొండలమాటున కునికిపాట్లు పడుతున్నాడు. నెలవంక వీళ్ల దురాగతాన్ని చూడలేనట్టు మబ్బుల చాటున ముఖం చాటేశాడు. ఆ యిద్దరిలో ఒకామె మళ్లీ మాట్లాడసాగింది.

“యిట్ల చెయ్యడం తప్పని మాకూ తెలుసు. ఎన్ని సంవత్సరాలని కడుపులు నిండీనిండక బతకమంటారు. పుట్టించిన ఆ దేవుడు అన్నీ సమకూర్చింటే మేమెందుకు ఈపని చేస్తాము. మా మాట యినండి. యింటికొగ ఆడపిల్లను పంపండి. అక్కడ ఏ ఇబ్బందీ వుండదు. సంవత్సరానికంతా దండిగా సంపాదించుకోని తిరిగొచ్చేస్తారు. మిద్దె యిండ్లు కట్టుకోవచ్చు. డబ్బు బేంకులో యేసుకుని జల్సాగా కర్చుచేసుకోవచ్చు.” అంది.

“మనది ఎట్లా జాతి. నిప్పునుగూడా నీళ్లతో కడిగే జాతి. పాణమైనా యిస్తాంగానీ మానం పోగొట్టుకోం.” అన్నారు చాపలమీదుండే ఆడవాళ్లలో కొందరు.

“అట్లనుకుంటే ఎప్పటికీ యిట్లే వుంటారు. మీ బిడ్డల బిడ్డలు కూడా ఏపూటకాపూట తిండికోసం ఎంపర్లాడాల్సిందే”

“ఔనౌను...ఎన్నేండ్లని యిట్లగసాట్లు పడతాం”

“అట్లని పరువుతక్కువ పని చేస్తామా?”

అక్కడున్నందరిలో మాటామాటా పెరిగింది. రెండు వర్గాలుగా విడిపోయారు. ఆ యిద్దరు ఆడవాళ్లను సమర్థించే వాళ్లు ఎక్కువగా వుండడంతో మిగిలిన వాళ్లంతా వీళ్లను తిట్టుకుంటూ వెళ్లిపోయారు.

“మీరందరూ ఆడపిల్లలను చదివించద్దంది...చదువుకుంటే పోమంటారు. వాళ్లు పోకపోతే మీ బతుకులు ఎప్పుడూ యింతే. రేపు మేము బొంబాయికి పోతాండాము. మాతోపాటు

సోమ్లీబాయిని, యింగా నలగర్ని తీసుకోనిపోతాండాము....” అంటున్న ఆమె మాటలను మధ్యలోనే అడ్డుకుంటూ “నీయమ్మా...యాడికే మీరు తీసుకొనిపోయేది...మీరు చెడింది కాక బంగారట్లా మా బిడ్డలను కూడా చెడస్తారా. యిప్పుడే నరికేస్తా...” అంటూ రౌద్రంగా లేచాడు సోమ్లీబాయి చిన్నాయన. జగ్నానాయక్ పరుగున వెళ్లి తమ్మున్ని ఆపాడు.

“ఎందుకంత కోపం. వాళ్లు చెప్తాండేది మన మేలుకోరే కదా” అన్నాడు.

“వాళ్లను కాదు....ముందు నిన్ను నరికేస్తా....” అంటూ అన్నను విదిలించి పారేసి కత్తికోసం యింటిలోకి జొరబడబోయాడు. మగవాళ్లంతా అతడ్ని పట్టుకుని ఆపారు.

“యిదేంపని బావా. తెలిసీ మన బిడ్డలచేత అట్లాపని ఎట్లా చేయించేది. ఆ సంపాదన లేకుంటేనేమి? సోమ్లీని పంపద్దండి” అంది సరోజినీబాయి.

“ఆడోళ్లకేం. మీరు ఎన్నయినా చెప్తారు. ఎంతకాలమని యిట్ల బతకమంటావు? మీరూ, మీ బిడ్డలు సచ్చిందాకా కూడా ఆ సుట్టిల్లు, కట్టెలమ్ముకోని బతికేదే గతి. మీకూ ఒగాడ బిడ్డవుండాది. పరిస్థితిని అర్థం చేసుకుంటారు, సుఖపడతారని రమ్మన్నే. మా బిడ్డ, మా యిష్టం. వద్దనే దానికి నువ్వెవరు? వచ్చిందానికి తిన్నేరు. మేము చేసేపని సమ్మతమయితే వుండండి. లేకుంటే మీ దోవన మీరు పోతాండండి. కాదు కూడదని అడ్డమొస్తే బాగుండదు” అన్నాడు సోమ్లీబాయి తండ్రి జగ్నానాయక్.

సోమ్లీబాయి చిన్నాయన, చిన్నమలు మారు మాట్లాడలేకపోయారు. భార్యను పోదాం లేవమన్నాడు. సరోజినీబాయి వెక్కివెక్కి ఏడుస్తోంది. ఏడ్పుతోనే భర్తను అనుసరించింది. సోమ్లీబాయికి మెలకువ వచ్చింది. తన చిన్నాయన, చిన్నమ్మ వెళ్తుండటం, అందరూ మౌనంగా వాళ్లనే చూస్తుండటం, నిద్రమత్తు అయోమయంగా దిక్కులు చూడసాగింది.

ఆకాశంలో తీతువు అరుస్తూ వెళ్లింది. సక్కీబాయి భయంగా అక్కచేయి పట్టుకుంది. అంతటితో సోమ్లీబాయి మాటల ప్రవాహానికి అడ్డుకట్ట వేసినట్టయింది.

“వుత్తీత అరుపుకే భయపడితే, క్రూర మృగాలుండే బొంబాయికి పోయి డబ్బెట్ల సంపాదిస్తావు?” అంది చెల్లి తల నిమురుతూ సోమ్లీబాయి.

“నువ్వు బొంబాయి పోయినాంక దుడ్డు బాగా సంపాదించినావు కదాక్కా”

“అవును దాంతోనే కదా యిల్లు కట్టినారు”

“అయితే నేనెందుకు యిప్పుడు పొయ్యేది?”

“ఎందుకా....అన్నకు స్కూటర్ కావాల. అమ్మకు పెద్ద కలర్ టివి కావాల. నాయనకు లంజలు కావాల” అంది కసిగా సోమ్లీబాయి.

సక్కీబాయి ఆ నిజాలను జీర్ణించుకోలేకుండా వుంది.

“నాయన అట్లావోడు కాదుక్కా” అంది.

ఆ మాటలకు సోమ్లీబాయి పకపకా నవ్వింది. నవ్వుతూ ఏడ్చింది.

"నేను బొంబాయికి పోకముందు దాంకా అట్లావోడు కాదు. నేను అట్నుంచి డబ్బు పంపినాంకనే యిట్ల మారిండేది. నేను ఈడికొచ్చి రెండు నెల్లవుతాండాది. నువ్వు సుండుపల్లె హాస్టల్లో వుండావు. అన్న తిరుపతిలో చదువుకుంటా వుండాడు." కాసేపాగింది సోమ్లీబాయి. తిరిగి తనే "నాయనే కాదు. చాలామంది దుడ్డు దుబారా చేస్తాండారు. ఆడికి పొయ్యినోళ్లేమో అట్ల... ఈడుండే వాళ్లేమో ఇట్ల...." అంది.

"నువ్వొచ్చిన రోజు ఏమయిందిక్కా" అంది సక్కీబాయి.

రెండు నెలల్రకితం జరిగిన సంఘటనలు అయినా...అప్పుడే, తన కళ్లముందే జరిగినట్లు వుంది సోమ్లీబాయికి. ఆనాటి సంఘటనలు యధాతథంగా చెప్పసాగింది చెల్లెలికి.

"ఈ రోజు తేలిపోవాల....నేను కావాల్నో, అది కావాల్నో.." అని మనసులో అనుకున్నాననుకుంది కేశ్లీబాయి. అలా సాయంకాలంనుంచీ కొన్ని పదులసార్లు అనుకుంటుండటంతో తనకు తెలీకుండానే పైకి అంటోంది.

ఆ రోజు అమావాస్య. రాత్రి పదిగంటలు దాటింది. అఖరి బస్సుయింకా రాలేదు. కేశ్లీబాయి యింటిముందుకొచ్చి ఒకసారి బాటవైపు చూసింది. అప్పటికి అందరూ భోజనాలు ముగించి లైట్లు ఆర్పి పడుకోనుండటంతో ఆమె కళ్లకు అనంతమైన చీకటి తప్ప మరేం కన్పించలేదు. సర్వేంద్రియాలను వినికిడిపైన కేంద్రీకరించింది. ఏ విధమైన వాహనశబ్దమూ లేదు. కొందరిళ్లలోని టివిల మోత, వాటికి జతగా అప్పుడప్పుడూ కుక్కల అరుపులు. భర్త రాకకోసం నిరీక్షిస్తున్న ఆమెకు రెండిళ్ల అవతలనుంచీ ధమీధమీ మని కొట్టిన శబ్దం వినిపించింది.

శబ్దం వెనుకే "అమ్మో...నాయనో...సంపేస్తాండాడుమో...." అరుపులు విన్పించాయి. అరుపుల వెనకే వీధిలోకి వచ్చింది ఖీరియాబాయి. ఆమె భర్త కోదయ్‌నాయక్ కూడా వీధిలోకి వచ్చాడు. అతను బాగా తాగి వున్నాడు. బండబూతులు మాట్లాడుతూ చేతిలో బెల్టుతో భార్య వెంటపడ్డాడు. వాళ్ల అరుపులకు చుట్టుపక్కల ఇళ్లల్లో వాళ్లు టివిల ముందునుంచి, నిద్రలేచి వచ్చారు.

భార్య జుట్టు చేజిక్కుంచుకుని బెల్టుతో తన యిష్టం వచ్చినట్లు బాదుతున్నాడు.

"రేయ్ కోదయ్...ఏం పనది. సచ్చిపోతుంది. గమ్మునుండరా...." అడ్డుపోయాడు రూప్లానాయక్.

కోదయ్‌నాయక్ కొట్టడం ఆపాడుకానీ భార్య జుట్టును మాత్రం వదల్లేదు.

"అయితే రెండు వేలిమ్మను" అన్నాడు రూప్లానాయక్‌తో.

"ఎందుకు ...తాగి తందనాలాడను, ముండలకు బెట్టనా దుడ్డు. నేను సచ్చినా ఈను. దేశంగాని దేశంలో బిడ్డ కన్నగసాట్లుపడి దుడ్డంపతాంటే, ఈడ ఈ మాదిర్తో చేస్తాండాడు." అంది ఖీరియాబాయి ఏడుస్తూనే.

"నీయమ్మా...ఎందుకీవే....అదేమన్నా నీయబ్బ సొత్తా. యాడబెడ్డినావో చెప్పే" అంటూ మళ్లీ రెండు దెబ్బలేశాడు.

"రేయ్ కోదయ్...అందరూ చూడు ఎట్ల చూస్తాండారో. యింత రాత్రిలో దుద్దేం చేస్తావు....? పద్దన్నే తీసుకుందువులే గమ్మునుండు" అన్నాడు రూప్లానాయక్.

అతను యితని మాటలు వినిపించుకునే స్థితిలో లేడు. ఉన్మాదిలా భార్యను కొడుతున్నాడు. ఆమె అరచి కేకలు పెడుతోందే తప్ప డబ్బు ఎక్కడ వుండేది చెప్పడంలేదు. వీళ్ల గొడవను చూసి కేశ్లీబాయి తాత్కాలికంగా తన బాధ మరచిపోయింది. తనూ అక్కడికి వచ్చింది.

రూప్లానాయక్ చొరవగా పోయి అతని చేతిని పట్టుకుని ఆపబోయాడు. కోదయ్‌నాయక్ విసురుగా తోశాడతన్ని. పడబోయి నిలదొక్కుకున్న రూప్లానాయక్‌ను, తమనే చూస్తున్న మిగిలిన వాళ్లను చూసి "ఎవుడేగానీ నాకడ్డం రాగూడదు. వచ్చినాడంటే వానేలీ, వానెమ్మ....ఏనాకొడుకు ఒగరూపాయి నాకిస్తాండాడు. మా సుద్ది ఒగనికెందుకు. మేము ఎవుని దగ్గరకన్నా పోతాండామా. నేనూ, నాపెండ్లాం. నాయిష్టం. మీకెందుకు మధ్యలో" తిట్టడం మొదలుపెట్టాడు కోదయ్‌నాయక్.

అతను తిట్లు మొదలుపెట్టడంతో అందరూ తమకు సంబంధం లేదన్నట్టుగా యిళ్లలోకి పోయి తలుపులేసుకున్నారు. వీళ్లందరినీ చూస్తూ, తిడుతూ కాస్త ఏమరుపాటున వుండటంతో భర్త చేతిలోని జుట్టును జారలాక్కుని ఒక్క వుదుటన పరుగు తీసింది ఖీరియాబాయి. ఆమెను అనుసరించాడు కోదయ్‌నాయక్.

రుప్లానాయక్ వెళ్లబోతూ కేశ్లీబాయిని చూసి ఆగాడు.

"ఏం వదినా...వీళ్లకు దుడ్డేడిది" అనడిగాడు.

"రాయారం బిడ్కిలో ఖీరియా అక్క కొడుకు బొంబాయినుంచి ఈ రోజే వచ్చినాడు. ఈళ్ల కూతురుకూడా వాని దగ్గర దుడ్డంపిందట. అది ఈలేదనే ఈగొడవంతా." అంది కేశ్లీబాయి.

"పాపం...అయితే వారం పద్దినాలు ఖీరియాకు ఈ తిప్పలు తప్పవులే. మూడేండ్లనించీ వాళ్ల బిడ్డ పంపిన దుడ్డంతా పంపినట్టే తగలేస్తా వుండాడు. అక్కడేమో వాళ్లు అట్ల నాశనమయితాండారు. సోమ్లీబాయి ఎప్పుడొస్తాదొదినా" అన్నాడు రూప్లానాయక్.

సోమ్లీబాయి పేరు వింటానే కేశ్లీబాయి కళ్లలో నీళ్లు తిరిగాయి.

"తొలీగా పొయ్యినపుడు మూడేండ్లు ఈ పక్కకు రాలా. మళ్లా పోయి రేండేండ్లు అయితాందాది. యింగ పోనే వద్దన్నే. దుడ్డుంది గదా. దూర రాజ్యం పోదాం. నీకు పెళ్లి చేస్తాం అంటి. యినిపించుకోలా, నా మాటలకు నవ్వింది. పెండ్లి చేసుకొని మొగుని దగ్గర తన్నులు తింటా వుండలేను. ఈ అడివి కొంపల్లో అస్సలుండలేను. అక్కడయితే అడుగుబయట పెడితే కారు. ఉండేదానికి ఎసి రూము. తినేదానికి బిర్యానీలు. తాగేదానికి మంచి

మందు....అయ్యన్నీ ఈడ దొరకతాయా? ఈడవుంటే చేతిలో దుడ్డు ఖర్చయ్యేదేగానీ ఆదాయం వుంటాదా? అని ఎల్లిపోయింది. నాకయితే రోజూ కండ్లల్లో మెదలతా వుంది. పాడుదుడ్డు లేకుంటే పోయింది. బిడ్డ దక్కకుండా పోతాందే అని బాధగా వుందయ్యా" అంది కండ్ల నీళ్లు తుడుచుకుంటా.

"నేను మీకు ముందే చెప్పినా, పంపద్దండి అని. నా మాట యింటే గదా. ఈ చట్టుపక్కల వూర్లనించీ పోయిండేవాళ్లలో ముప్పైమందికి ఎయిడ్స్ వచ్చింది. వాళ్లు ఎట్లుండారో చూసినావుగదా. మన అమ్మల మాదిర్తో ముసిలోళ్లయి పోయినారు. ఈడికి వచ్చినోళ్లు కొందురే. ఆడ చానామంది దిక్కులేని సావు సచ్చినారంట. తొలీగా పొయ్యిన్నేరే యిద్దురాడోళ్లు...వాళ్ల బతుకులూ అట్లే కడతేరిపాయ. యింత జరగతాన్నే ఈడుండేవోళ్లకు బుద్ధి రావడంలేదే! యింగా బిడ్డలను పంపతానే వుండారు. తలుచుకుంటే కడుపు కాలిపోతాది వొదినా. రాత్రంతా చెప్పుకున్నే తీరే బాధలు కాదియ్యి. నేను మొబ్బుతో బస్సుకు చిత్తూరుకు పోవాల. వస్తా." అంటూ వెళ్లిపోయాడు రూప్లానాయక్.

అతనటువెళ్లగానే కేశ్లీబాయి కూడా యిల్లు చేరింది.

ఈ మధ్య భర్త ఎవరితోనే తిరగతాండాడని, వేలకు వేలు ఆమె కోసం తగలేస్తాండాడని కొడుకుద్వారా తెలిసింది. రోజూ రాత్రులల్లో అతని ఆలశ్యానికి కారణం కూడా అదేనని కొడుకు చెప్పాడు. ఈ రోజు ఎట్లయినాకానీ భర్తను నిలదీయాలనుకుంది. ఖీరియాబాయి గొడవ, రుప్లానాయక్ మాటలు, కేశ్లీబాయి ఆలోచనలను భర్తమీదనుంచి బిడ్డమీదకు మళ్లించాయి.

గోడగడియారం పన్నెండు గంటలు కొట్టింది. ఆఖరి బస్సు రానేలేదు. తలుపేసి వచ్చి హాల్లోచాపమీద పడుకుంది. ఎప్పుడూ లేనిది ఆరోజెందుకో "కూతురు యిప్పుడు ఏం చేస్తాంటింది" అనుకుంది. ఏం చేస్తా వుంటుందో ఆలోచనల్లో వూహించుకోకముందే ఆమె వళ్లు జలదరించింది. ధారాపాతంగా కేశ్లీబాయి కళ్లనుంచి నీళ్లు కారసాగాయి. ఎప్పటికో నిద్రపట్టింది.

తలుపు దబదబా బాదుతుంటే ఉలికిపాటుగా లేచింది కేశ్లీబాయి. గోడగడియారం వైపు చూసింది. రెండు గంటలు కావస్తోంది. వెళ్లి తలుపు తీసింది. భర్తకన్నా ముందుగా అతని నోటినుంచి విస్కీవాసన. భార్యను తోసుకుంటూ జగ్గానాయక్ లోపలకు వచ్చాడు. ఆమెకు విపరీతమయిన కోపం వచ్చింది. ఆ రోజు తాడోపేడే తేల్చుకోవాలనుకుంది.

"యింతవరకు యాడున్నేవు" అంది భర్తతో.

జగ్గానాయక్ భార్య ముఖంలోకి కోపంగా చూశాడుగానీ సమాధానం యివ్వలేదు.

"నిన్నే.... యింతవరకూ యాడున్నేవు" రెట్టించింది కేశ్లీబాయి.

"లంజముండా....నన్నే అడగతావే" అంటూ భార్య జుట్టు పట్టుకుని వంగదీసి వీపుమీద దెభీదెభీమని గుద్దాడు. రాత్రి అన్నం తినక పోవడమూ, నిద్రలేకుండా భర్త కోసం ఎదురుచూడడంతో నీరసంగా వున్న ఆమె కిందపడిపోయింది.

సోమ్లీబాయి కళ్లనుంచి నీళ్లు. సక్కీబాయి కళ్లుకూడా వర్షించసాగాయి.

యిద్దరూ కాసేపు ఏడ్చుకున్నేరు.

"ఆ రోజు నువ్వు యాడున్నేవుక్కా"

"ఖీరియాబాయి వాళ్లు వీధిలో గొడవ పడతాన్నేరు. నేను ఏడుగంటల బస్సుకు వచ్చినా. అది మధ్యలో పంచరయింది. నడుచుకుంటా వచ్చేసినా. అమ్మ గొడవ దగ్గరున్నింది. నేను నేరుగా పొయ్యి బెడ్‌రూంలో పడుకున్నే. నన్నారాత్రంతా అమ్మోళ్లు గమనించలా" అంది సోమ్లీబాయి.

"దప్పికగా వుండాదిక్కా" అంది సక్కీబాయి.

ఏటిలోకి దిగారు. నీళ్లకు రెండు బారల దూరంలో జానడులోతు మట్టిని తోడారు. అందులోకి నీళ్లు రాసాగాయి.

"చెలమలోకి నీళ్లు రానీ. అన్నం తిన్నేవా?"

"లేదక్కా... నిన్ను పిల్చకపోదామని వచ్చినా" అంది సక్కీబాయి.

"అయ్యో...చానా రాత్రయితాండాదే. నేనూ అన్నం చెయ్యలా. యింట్లో తినేదానికి ఏమీ లేదే" అంది సోమ్లీబాయి.

"లేకుంటే పోనీలేక్కా...ఆకలి పోయింది." అంటూ చెలమలోంచి దోసిలితో నీళ్లు తీసుకుని తాగింది. తిరిగి తనే "నువ్వు బొంబాయి పోయిందానికి అమ్మ బాధపడతాందన్నేవే. అయితే నన్నెందుకు పంపుతాంది మళ్లా" ప్రశ్నించింది సక్కీబాయి.

"అమ్మ అందరి ముందరా అట్లా మాట్లాడతాదంతే. యింట్లోకి అన్ని వస్తువులూ కావాలనే కోరిక ఎక్కువగా వుండాది. నేను ఆరోగ్యం బాగలేక యింటికి వస్తే దానికి బాధపడలా. యింగో సమచ్చరమన్నా వున్నింటే యింట్లోకి అన్ని వస్తువులు తీసుకోనుందుమే అని బాధపడింది." అంది సోమ్లీబాయి విచారంగా.

"అయితే నేను పోయి సంపాదిస్తాక్కా...యింట్లోకి వస్తువులు తీసుకోవచ్చు. నీకు బాగ చేపిస్తా."అంది సక్కీబాయి.

"పిచ్చిపిల్లా...అంత ఆవేశం వద్దు. నా జబ్బు బాగయ్యేది కాదు. నా పాత ఫోటోలు చూసినావు కదా. ఎట్లుండాను. నువ్వున్నెట్లే వుండలా. నాకు యిరవై ఏండ్లు కూడా లేవు. ఎట్లయిపోయినానో చూడు. యింగ సమచ్చరం బతుకుతానేమో అంతే. నా మాటిను. నువ్వు బొంబాయి పోవద్దు. ఆ సంపాదన వద్దు." అంది సోమ్లీబాయి.

"నేను పోనంటే అమ్మోళ్లు వప్పుకోరేమో" అంది కాసేపు విరామం తర్వాత సక్కీబాయి.

"ఈరోజు నిన్ను పంపిచ్చే దానికి వస్తారని నాకు తెలుసు. మన కులపెద్ద వుండ్లా భూచ్యానాయక్. ఆ తాతతో చెప్పినా. ఎట్లయినాగానీ నువ్వు పొయ్యేది ఆపమని. ఆ తాత వచ్చి మాట్లాడతా వుంటాడు. పోదాంపా" అంది లేస్తూ సోమ్లీబాయి.

సక్కీబాయి అక్కను అనుసరించింది. యిద్దరూ మాట్లాడుకుంటూ, అడ్డదారింటీపోయి తమ యింటి వెనక చేరుకున్నారు. భూచ్యానాయక్ అప్పుడే అక్కడకు వచ్చినట్లున్నాడు మంచం మీద కూర్చోనున్నాడు. మిగతా అందరూ నిల్చుకోనుండారు.

"కూచ్చోండి...కూచ్చోండి" అన్నాడు. అందరూ కూర్చున్నారు.

"మన సుగాలోల్లంటే అందరికీ చులకనయిపోతాండాది. మీరు ఆడపిల్లలను పంపతాండేది నాలుగు రాజ్యాలకూ తెలిసిపోయిండాది. పేపర్లలో గూడా వచ్చిందంట గదా" అన్నాడు భూచ్యానాయక్.

"వాళ్లెవరో బుద్దిలేనోళ్లు రాసింటారు. మనం ఒకరిజోలికి పోలా. మన తిప్పలు మనం పడతాండాము. వాళ్లకెందుకు యియ్యన్నీ" అన్నాడు జగ్నానాయక్.

అందరూ మౌనంగా వుండిపోయారు.

"మా కూతుండ్లను మేము లంజల చేసుకుంటామో.... చంపుకుంటామో.... వాళ్ల కెందుకిదంతా" అన్నాడు కోపంగా కోదయ్‌నాయక్.

"అడవిలోనే వుండి మన బతుకు మనం బతకతాండామా? లేదే. మన బిడ్డలను టౌనులపైకి ఎగదోలతాండాము. నేను చదువుకోలేదు. శాస్త్రాలు తెలీదు. కానీ నాకు తెలిసి ఎవరూ యిట్లా పని చెయ్యలా. మనవడా సోమ్లా...తిరపతిలో చదవతాండావు. నువ్వయినా చెప్పు. ఈ మాదిర్తో చెయ్యచ్చా. తప్పుకదా." అన్నాడు భూచ్యానాయక్.

"తప్పెందుకు తాతా?" ఎదురు ప్రశ్నించాడు సోమ్లానాయక్.

"తప్పుకాదా?!" అన్నాడు ఆశ్చర్యంగా భూచ్యానాయక్.

"కాదు. మీ రోజుల్లో అయితే తప్పు. అప్పుడు మీకు బతికే దానికి అడివి బాగున్నింది. వానలు పడతాన్నేయి. అన్నోయిన్నో గింజలు పండతాన్నేయి. యిండ్ల పనులుంటాన్నేయి. పింఛా నిండతాన్నింది. కూలి పనులుంటాన్నేయి. యిప్పుడు...పించా నిండి ఎన్నేండ్లయింది? పంటలు సరిగా పండి ఎన్నేండ్లయింది? పనుల్లేక పస్తులతో చావమంటావా?" అన్నాడు సోమ్లానాయక్ తమ పెద్దవాళ్ల నిర్ణయం తప్పు కాదన్నట్టుగా.

"అందరూ నీయట్లా మడిమేలం నా కొడుకులు పుట్టే మన జాతి ఈ మాదిర్తో నాశనం అయిపోతాండేది. తొలీగా యిద్దరు పొయ్యొచ్చినప్పుడే నేనొగసారి చిత్తూరులో డిఎస్పీతో ఈ మాట చెప్పినా. మనమేం చేస్తాం. వాళ్లు తప్పు ఈడ చెయ్యలేదు కదా అన్నేడు. కాపాడే

శక్తుండేవాళ్లేమో అట్ల. ఏదో, బిడ్డలు యింటారు కదా అని చెప్తే మీరు యిట్ల. మీ చావు మీరు చావండి" అంటూ అక్కడినుంచి వెళ్లిపోయాడు భూచ్యానాయక్.

"ఆ....ముసిలోడి మాటలు ఏం పట్టించుకోవద్దండీ" అన్నాడు జగ్నానాయక్.

సోమ్లీబాయి, సక్కీబాయి అక్కడినుంచి వెనుదిరిగారు. కొంత దూరం రాగానే సక్కీబాయి ఆగి వెనక్కు చూడసాగింది. సోమ్లీబాయి కూడా ఆగింది.

"అక్కా....ఆ మిద్దెలన్నీ మీరు సంపాయించినోటియే గదా" అని ప్రశ్నించింది సక్కీబాయి.

"....."

"మీరు పంపిన దుడ్డుతో యిండ్లు కట్టుకోని వాళ్లు బాగుండారు. మీకు బాగలేకుండా పోయాలకు వూరికి దూరంగా గుడిశెల్లో పెట్టేసినారు. ఎంత అన్యాయంకా" అంది సక్కీబాయి.

"రారా పోదాం. యిక్కడే వున్నేమంటే నువ్వన్యాయం అయిపోతావు. యింగా వాళ్లు మాటల్లో మందులో వుండారు. పడుకునే ముందరయినా నీ కోసరం తాలాడతారు. ఆ లోపల మనం ఎళ్లిపోతాం." అంది సోమ్లీబాయి ముందుకు పోతా.

"ఏం చేద్దాంకా" అంది అక్కను అనుసరిస్తూ సక్కీబాయి.

"నీకు చదువు వచ్చా"

"మాక్లాస్‌లో నేనే ఫస్ట్....." అంది రోషంగా సక్కీబాయి.

"అయితే భయం లేదు. నా దగ్గర దుడ్డుంది. యిట్లేదో అయితాదని ముందే జాగ్రత్త పన్నే. మేము అక్కడ అనుభవించిన బాధలు, యిక్కడ కనుక్కున్న వాళ్లు అక్కడకు పంపేతీరు అన్నీ తెలిసిందాన్ని కదా. నేను చెప్పింది నువ్వు రాయి. అన్ని పత్రికలకూ, అందరు నాయకులకూ పంపిద్దాం. ప్రపంచం దృష్టి మన బిడ్కీమీద పడేటిగా చేస్తేచాలు. మిగిలిన అమ్మాయిలంతా నూరేళ్లు బతికినట్టే" అంది సోమ్లీబాయి.

"బాగుందిక్కా నీ ఆలోచన" అంది సక్కీబాయి.

"మనం అనుకుంది తప్పకుండా చేస్తాం. అంతవరకు వీళ్ల చేతికి దొరక్కుండా వుండాలంతే" అంటూ అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా వేగంగా నడవసాగింది. సోమ్లీబాయి.

చీకటిని చీల్చుకుంటూ వెలుగుదారి వైపు వాళ్లు వడివడిగా పయనిస్తున్నారు.

*సమరం, కథా సంకలనం, ఫిబ్రవరి 2006*